బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పెద్దపీట

- ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి
- 26న సామాజిక న్యాయభేరి బస్సు యాత్ర జయప్రదం చేయండి


గార్లదిన్నె ఎంపీడీఓ కార్యాలయంలో మాట్లాడుతున్న ఆలూరి సాంబశివారెడ్డి

గార్లదిన్నె: జగనన్న ప్రభుత్వం బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అన్నిరంగాల్లో పెద్ద పీట వేసిందని రాష్ట్ర ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సామాజిక న్యాయాన్ని ప్రజలకు చెప్పేలా ఈనెల 26న బుక్కరాయసముద్రంలో సామాజిక న్యాయభేరి బస్సు యాత్ర, బహి రంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బస్సు యాత్రను నియోజకవర్గంలోని ప్రతి మండలం నుంచి నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సరేంద్రరెడ్డి, ఎంపీపీ వెంకటనారాయణ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ప్రదీప్ రెడ్డి, జంబులదిన్నె సొసైటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, పాలిఏకరి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పరంధామ, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బస్సుయాత్ర జయప్రదం చేయండి

నార్పల: ఈనెల 26న బుక్కరాయసముద్రంలో తలపెట్టిన సామాజిక న్యాయభేరి బస్సుయాత్ర, బహిరంగ సభను జయప్రదం చేయాలని ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య కోరారు. శనివారం శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వారు పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు అన్ని రకాలుగా అండగా ఉన్నారన్నారు. ఇప్పటికే ఆయన వారికి ఎన్నో నామినేటెడ్ పదవులు ఇచ్చి పెద్దపీట వేశారన్నారు. నార్పల మండలంలో ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌తో పాటు ఎన్నో పదవులు కేటాయించారన్నారు. వీటితో పాటు జిల్లా స్థాయిలో అనేక మందికి ఉన్నత పదవులు అందించారన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు ,గృహసారథులు పెద్ద ఎత్తున తరలివచ్చి బహిరంగ సభను జయప్రదం చేయాలన్నారు. రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నిట్టూరు రఘునాథ్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరావు, జిల్లా అధికార ప్రతినిధి మిద్దె కుళ్లాయప్ప, సొసైటీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, కో ఆప్షన్ షాబీరా, వైస్ ఎంపీపీ మల్లేశ్వరయ్య సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 30వ వార్డుకు చెందిన అఫ్రోజ్‌కు సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.1 లక్ష చెక్కును ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అందజేశారు. శనివారం ఎమ్మెల్యే తన నివాసంలో బాధిత మహిళకు చెక్కు అందించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, కౌన్సిలర్ చాముండేశ్వరి పాల్గొన్నారు. 33వ వార్డుకు చెందిన నాగవేణి కుమార్తె వైద్యఖర్చులకు ఎమ్మెల్యే రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

మాతృభాషను మరువరాదు


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: యువత మాతృభాషను మరువరాదని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత తెలుగు అధ్యాపకులు డాక్టర్ వీరుపా కొండారెడ్డి రచించిన శ్రీ దొణ తిమ్మరాయ శతకం పుస్తకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. శనివారం హౌసింగ్‌బోర్డులోని శ్రీవివేకానంద ఉద్యానవనంలో శ్రీభారతీ సాహితీ సమితి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. జనప్రియ కవి ఏలూరి యంగన్న శతక ఆవశ్యకతను వివరించారు. పుస్తక రచయిత కొండారెడ్డిని శాలువా, పూలమాలతో ఎమ్మెల్యే సత్కరించారు. రిటైర్డ్ తెలుగు పండిట్ మల్లికార్జున శాస్త్రి, అవధాని గురువేపల్లి నరసింహులు, భారతీ సమితి కోశాధికారి వంకదారు సురేంద్ర, అధ్యాపకులు వెంకట ప్రసాద్, పరమేష్, ఎర్రిస్వామిరెడ్డి, సుధాశేఖర్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఘనంగా విద్వాన్ విశ్వం జయంతి

గుంతకల్లు: రాయలసీమ విమోచన సమితి ఆధ్వర్యంలో విద్వాన్ విశ్వం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సమితి కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి విశ్వం చిత్రపటానికి పూలమాల వేసి నివాళు ర్పించారు. ఎమ్మార్పీఎస్ కార్యదర్శి కాశీరావు, జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు గురుశంకర్, రాయలసీమ విమోచన సమితి నాయకులు కోటీశ్వరరావు, సీతారామిరెడ్డి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అల్లారఖా సొసైటీ సేవలు అభినందనీయం


మహిళకు నిత్యావసరాలు అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి అర్బన్: అల్లారఖా సొసైటీ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. శనివారం ఏటిగడ్డపాలెంలోని అల్లా రఖా సొసైటీ కార్యాయలంలో దసరా పండుగ సందర్భంగా పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలన్నారు. సొసైటీ తరపున ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. అర్బన్ సీఐ హమీద్‌ఖాన్, అల్లారఖా సొసైటీ వ్యవస్థాపకుడు అయూబ్, చింతల వెంటరమణస్వామి ఆలయ చైర్మన్ మురళీప్రసాద్‌రెడ్డి, నాయకులు అంబటి రాఘవరెడ్డి, సూర్యప్రభాకర్‌బాబు, డివి కుమార్, జాకీర్ పాల్గొన్నారు.

చింతలరాయుడి బ్రహ్మోత్సవాలు షురూ

తాడిపత్రి అర్బన్: చింతల వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం సేనాధిపతి ఉత్సవంతో ప్రారంభమయ్యాయి. ఆలయం ప్రాంగణంలో విశ్వక్సేనుడి ఉత్సవంతో శాస్త్రోక్తంగా పుట్టమన్ను సేకరించారు. ముందుగా పవిత్రమైన జలాలతో తీర్థ బిందెను ఆలయానికి తీసుకొచ్చారు. స్వామి కల్యాణ మండపంలో ఉత్సవ మూర్తులను ఆశీనులను చేసి విశ్వక్సేన పూజ, పుణ్యాహావచనం, కంకణధారణ నిర్వహించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సతీమణి కేతిరెడ్డి రమాదేవి, ఆలయ చైర్మన్ మురళీప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

గాజా ప్రజలకు రక్షణ కల్పించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

గుంతకల్లుటౌన్: గాజా ప్రజలకు రక్షణ కల్పించాలని ప్రభుత్వ ఖాజీ సయ్యద్ రజాక్‌పీర్ సాహెబ్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మైమూన్‌లు డిమాండ్ చేశారు. సేవ్ పాలస్తీనా–బాయ్‌కాట్ ఇజ్రాయెల్ నినాదంతో ముస్లిం సంఘాలు శనివారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించాయి. స్థానిక ఈద్గా మైదానం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ అంజుమన్ స్ట్రీట్, గాంధీచౌక్, మెయిన్‌రోడ్డు మీదుగా మదీనా ఆర్చ్ వరకు కొనసాగింది. ఇజ్రాయెల్‌కు చెందిన ఉత్పత్తులను అక్కడ ధ్వంసం చేశారు. అనంతరం అక్కడ జరిగి భారీ బహిరంగ సభనుద్దేశించి ప్రభుత్వ ఖాజీ, వైస్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ గాజాపై ఇజ్రాయెల్ ఉధృతంగా దాడులను కొనసాగిస్తూ వందలాది మంది అమాయక ప్రజలను పొట్టనబెట్టుకుంటోందన్నారు. ఐక్యరాజ్యసమితి, ప్రపంచ దేశాలు జోక్యం చేసుకుని పాలస్తీనా–ఇజ్రాయెల్ మధ్య యుద్ధాన్ని ఆపాలన్నారు. అదనపు ఖాజీ సత్తార్ సాహెబ్, కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, ముస్లిం మత పెద్దలు, ఇమామ్‌లు, మౌజన్‌లు, వివిధ ముస్లిం సంఘాల ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు. ర్యాలీకి అనుమతి ఇప్పించిన స్థానిక ఎమ్మెల్యే వైవీఆర్‌కు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు.

ప్రత్యేక లోక్ అదాలత్

గుత్తి: పట్టణంలోని ఏడీజే కోర్టులో శనివారం ప్రత్యేక లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఏడీజే శోభారాణి, జేఎఫ్‌సీఎం దీప్తి ఆధ్వర్యంలో మూడు ఎంవీఓపీ కేసులు పరిష్కరించారు. బాధితులకు రూ. 21,25,000 ఇచ్చేలా తీర్పు చెప్పారు. భరణం కేసులో బాధితురాలికి రూ.5 లక్షలు ఇవ్వాలని తీర్పు ప్రకటించారు. ఏపీపీ బుసా సుదీర్‌రెడ్డి, ఏజీపీ తిమ్మారెడ్డి, ప్యానెల్ లాయర్లు గంగాధర్ కుమార్, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ నూర్ మహమ్మద్ , కోర్టు సిబ్బంది సాదిక్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మున్సిపాలిటీలో నెలకొన్న తాగునీటి ఎద్దడిపై జేఎఫ్‌సీఎం దీప్తికి శనివారం ప్రజలు విన్నవించారు. వెంటనే స్పందించి హెచ్ఎల్‌సీ అధికారులను జడ్జి కోర్టుకు పిలిపించారు. గుత్తి చెరువును హంద్రీనీవా జలాలతో నింపాలని జడ్జి అధికారులను ఆదేశించారు.

యువకుడి బలవన్మరణం

పామిడి: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు...పామిడి బీసీ కాలనీకి చెందిన నక్కా మహేష్ (28)కు భార్య రాజేశ్వరి, నలుగురు కుమార్తెలున్నారు. కారు డ్రైవర్‌గా పని చేసేవాడు. ఫైనాన్స్ కింద సొంతంగా ఓ కారు తీసుకుని అద్దెకు తిప్పడం మొదలుపెట్టాడు. అయితే బాడుగలు సక్రమంగా రాక నెలవారీ రూ.14 వేలు ఫైనాన్స్ కంతు చెల్లించడం భారమైంది. ఫైనాన్స్ కంపెనీ నుంచి ఒత్తిళ్లు తీవ్రం కావడంతో మనస్తాపం చెందిన ఆయన శనివారం ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మహమ్మద్ వలి తెలిపారు.

'ఈనాడు రాతలు పత్రికా విలువలకే గొడ్డలిపెట్టు'

పామిడి: ఈనాడు ప్రతికలో వస్తున్న కథనాలు పత్రికా విలువలకే గొడ్డలిపెట్టుగా మారాయని ఎమ్మెల్యే వై వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం రాత్రి ఆయన పామిడిలో సీసీరోడ్లను పరిశీలించారు. టీడీపీ హయాంలో అవినీతే ధ్యేయంగా పని చేస్తే తాము అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. వీధివీధికి నాణ్యతతో రోడ్లు నిర్మిస్తే ఇసుక దోపిడీ చేశారని టీడీపీ ఆరోపించడాన్ని ప్రజలు ఈసడించుకుంటున్నారన్నారు. రోడ్ల నిర్మాణంపై స్థానికులు ఎమ్మెల్యే ఎదుట హర్షం వ్యక్తం చేశారు. అనంతరం కన్యకా పరమేశ్వరి, చిన్న విఠోబ, అంబా భవాని ఆలయాలను దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జోజోడే కుమార్, పట్టణ సచివాలయాల కన్వీనర్ బీ ఆసిఫ్, సీ అబ్దుల్ రజాక్, ఫర్యాద్, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

యాడికి: రాయల చెరువులో శనివారం పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్, లియో క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. అంతకు ముందు ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది లయన్స్ క్లబ్ సభ్యులతో కలిసి పోలీసు అమర వీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు.

మిరప పంట పరిశీలన

పెద్దవడుగూరు: మండల కేంద్రంలో మిరప పంటలను జిల్లా హార్టికల్చర్ అధికారి రఘునాథ రెడ్డి శనివారం పరిశీలించారు. రైతులతో పంట సాగుపై ఆరా తీశారు.

యువకుడి ఆత్మహత్య

తాడిపత్రి అర్బన్: వ్యాపారంలో నష్టాలు రావడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రి శివాలయం వీధిలో నివాసముంటున్న కావేటి రామాంజనేయులు (29) ఇటీవల పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టి ఓ ఫర్నీచర్ దుకాణాన్ని ప్రారంభించాడు. ఆశించిన స్థాయిలో లాభాలు రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన శనివారం తన ఇంట్లోనే పైకప్పుకు ఉరి వేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తండ్రి సంజీవులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ నాగన్న తెలిపారు.

పోలీసుల సేవలు మరువలేనివి


గౌరవ వందనం స్వీకరిస్తున్న చిన్నారావు

బుక్కరాయసముద్రం: సమాజంలో పోలీసులు సేవలు మరువలేనివి అని ఓపెన్ ఎయిర్ జైలు సూపరిండెంటెడ్ చిన్నారావు పేర్కొన్నారు. శనివారం జంతలూరు సమీపంలో ఉన్న 14వ ఏపీఎస్పీ బెటాలియన్‌లో అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప అధ్యక్షతన అమరవీరుల స్మారక దినోత్సవం నిర్వహించారు. ఏపీఎస్పీ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ రమణ మూర్తి, అసిస్టెంట్ కమాండెంట్ విల్సన్, ఆర్ఐలు నాగేంద్ర, లోకేశ్వరనాయుడు, సీతారామారావు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

శింగనమల: జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, ఎంపీడీఓ నిర్మలాకుమారి పేర్కొన్నారు. పెరవలి గ్రామ సచివాలయంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వైద్యులు శంకర్‌నాయక్, ఫిర్దోస్ రోగులకు పరీక్షలు చేసి మందులు అందించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: గుత్తిఅనంతపురంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. వైద్యులు 513 మందికి పరీక్షలు చేసి మందులు అందించారు. జిల్లా ప్రోగ్రామ్ అధికారి నారాయణస్వామి, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: వంగనూరులో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు రోగులకు పరీక్షలు చేసి మందులు అందించారు. తహసీల్దార్ మునివేలు, ఏఓ వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

వర్షం కోసం ముస్లింల ప్రార్థనలు


గుత్తి: వర్షం కోసం గుత్తి చెరువులో శనివారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ శ్రీనివాసరెడ్డి, పట్టణ కన్వీనర్ పీరా, కౌన్సిలర్లు సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం మతపెద్దలు మాట్లాడుతూ గతంలో కూడా వర్షాలు రాని సమయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశామన్నారు.

సొంతూరుకు సేవ చేయడం సంతోషదాయకం


బాధ్యతలు చేపట్టిన ఆర్డీఓ అనురాధ

గుంతకల్లు: సొంత ఊరికి సేవ చేసే భాగ్యం దక్కడం సంతోషకరమని ఆర్డీఓ కే.అనురాధ పేర్కొన్నారు. ఆమె శనివారం ఆర్డీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గుంతకల్లు, పామిడి తహసీల్దార్లు ప్రతాప్‌రెడ్డి, సునీతబాయి డివిజన్ పరిధిలోని రెవెన్యూ సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. తన విద్యాభ్యాసం అంతా గుంతకల్లులో జరిగిందని ఆర్డీఓ తెలిపారు. అనంతరం ఆమె ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

పార్వతీమాతా పాహిమాం!


పుట్లూరు మండలం కోమటికుంట్లలో పూజలందుకున్న దుర్గమ్మ

సాక్షి నెట్‌వర్క్: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా శనివారం తాడిపత్రి, శింగనమల, గుంతకల్లు నియోజకవర్గాల్లోని అమ్మవార్ల ఆలయాల్లో పూజలు ఘనంగా జరిగాయి. అర్చకులు అమ్మవార్లను ప్రత్యేక రూపాల్లో కొలువుదీర్చి పూజలు చేపట్టారు. పెద్దసంఖ్యలో మహిళలు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు. తాడిపత్రిలోని వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు.


గుంతకల్లులో శ్రీ లంక శాంకరీదేవిగా వాసవీమాత


తాడిపత్రి కన్యకపరమేశ్వరి ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి, కుటుంబ సభ్యులు